క్లుప్తంగా

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజన సందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, ధర్మకర్తలు గనగోని రమేష్, తాళ్లపల్లి బుచ్చయ్య, గోలి రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ కిట్ల అందజేత



జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామంలో విద్యార్థులకు వేసవి కరాటే శిక్షణ ఇచ్చేందుకు కోసం మాస్టర్ అన్నెపు రాజేంద్రానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా మార్షల్ ఆర్ట్స్ కిట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ రాజేంద్రం మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కరాటే శిక్షణ దోహదపడుతుందని అన్నారు.

రాజయ్య .. నోరు అదుపులో పెట్టుకో..

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు



రఘునాథపల్లి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్లు మంజూరు చేయిస్తుంటే జీర్ణించుకోలేక దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని, రాజయ్యా .. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కన్నాయపల్లి పైలెట్ గ్రామంలో సంక్షేమ పథకాలు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేసిన ఆరోపణలపై వారు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆ గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో కలిసి తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోకుంటే గ్రామాల్లో తిరగనివ్వబోమని వారు హెచ్చరించారు. మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నామాల బుచ్చయ్య, గౌరిగ రవి, లోనె శ్రవణ్, గాదె మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు



బచ్చన్నపేట: భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ మండల నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ నిధులను కేటాయించాలని కోరారు. మాసపేట రవీందర్ రెడ్డి, జిల్లా సందీప్, మట్టి బాల్‌రాజు, హరీష్, అఖిల్, పోషయ్య, యాదిరెడ్డి, హరికృష్ణ, తిరుపతిరెడ్డి ఉన్నారు.

‘కేసులు పెండింగ్ లేకుండా చూడాలి’



జఫర్‌గఢ్: పోలీస్‌స్టేషన్లలో ఎలాంటి కేసులు పెండింగ్ లేకుండా చూడాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డివిజన్ స్థాయి పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసీపీ అంబటి నర్సయ్య మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసులను నమోదు చేసిన వెంటనే చేధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సమావేశంలో వర్ధన్నపేట, పాలకుర్తి సీఐలు కొమ్మూరి శ్రీనివాస్‌రావు, గట్ల మహేందర్‌రెడ్డి, స్థానిక ఎస్సై రామ్‌చరణ్‌తో పాటు వర్ధన్నపేట, రాయపర్తి, కొడకండ్ల, దేవురుప్పుల, పాలకుర్తి ఎస్సైలు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు..

- కమ్మేస్తున్న మేఘాలు
- వాతావరణంలో విచిత్రం.. జనం పరేషాన్

జనగామ: భగ్గున మండుతున్న ఉష్ణోగ్రతలతో సూరీడు సుర్రుమంటుంటే... సాయంకాలం అయిందంటే ఆకాశంలో మబ్బులు కమ్మేస్తూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడి పోతోంది. వేసవి ప్రారంభం నాటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. జిల్లాలో మంగళవారం అత్యధికంగా జఫర్‌గఢ్‌లో 42.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, అత్యల్పంగా నర్మెటలో 37.8 డిగ్రీల మేర నమోదైయినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచే ఉక్కపోత మొదలు కాగా.. మధ్యాహ్నం 2 గంటల తర్వాత నిప్పుల కొలిమిని తలపించింది. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోగా జన సంచారం లేక వ్యాపార, వాణిజ్య సంస్థల ఏరియాలన్ని వెలవెల బోయాయి. ప్రజలు బయటకు రావాలంటే వణికిపోయారు. ఈ నేపథ్యంలో సాయంకాలం ఒక్క సారిగా ఈదురు గాలులతో వాతావరణం చల్లబడింది. ఎండ వేడిమికి ఉక్కిరిబిక్కిరైన ప్రజలు.. చల్లని గాలులతో కాసింత ఉపశమనం పొందారు. రాత్రి వరకు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసి పోకుండా రైతులు టార్పాలిన్ కవర్లు కప్పారు.



మండుతున్న ఎండలతో వాహనదారులు లేక బోసిపోయిన చౌరస్తా



జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు(డిగ్రీల సెల్సియస్)

మండలం	ఉష్ణోగ్రత
జఫర్‌గఢ్	42.1
కొడకండ్ల	41.1
పాలకుర్తి	41.8
చిల్పూరు	41.1
దేవరుప్పుల	40.6
జనగామ	40.2
స్టే.ఘన్‌పూర్	40.2
బచ్చన్నపేట	39.7
లిం.ఘనపురం	39.5
రఘునాథపల్లి	39.0
తరిగొప్పుల	38.8
నర్మెట	37.8



ఆర్టీసీ బస్టాండులో నీడ కరువై రావి చెట్టు కింద సేదదీరుతున్న ప్రయాణికులు



సుర్రుమంటున్న ఎండలో ట్రాక్టర్‌లో మొక్కలు తీసుకెళ్తున్న కూలీలు



గొడుగు నీడలో వెళ్తున్న మహిళలు



ఎండలో ప్రయాణం సాగిస్తున్న రిక్షా కూలీ

తాగునీటి నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- డీపీఓ ఎన్.స్వరూప

జనగామ రూరల్: గ్రామాల్లో తాగునీటి, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని డీపీఓ ఎన్.స్వరూప అన్నారు. మంగళవారం జనగామ ఎంపీడీఓ కార్యాలయంలో జనగామ, దేవరుప్పుల, లింగాల ఘన్‌పూర్ పంచాయతీ కార్యదర్శులతో సంస్థాగత కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ జీపీల్లో ప్రతి రిజిస్టర్‌ను తప్పని సరిగా అప్‌డేట్ చేయాలని అన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఎంపీడీఓలు సంపత్‌కుమార్, రఘురామకృష్ణ, సురేష్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ స్వరూప

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. భూభారతి చట్టం అమలు నేపథ్యంలో జిల్లాలో మొదటగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా వివిధ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్న క్రమంలో మంగళవారం మండలంలోని స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్లులో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆర్‌డీఓ సదస్సుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు రశీదులు అందిస్తారని, రైతులు సహకరించాలన్నారు. ఈనెల 5 నుంచి మండల పరిధిలోని చేపట్టిన రెవెన్యూ సదస్సులు ముగిశాయని, మొత్తంగా 1,068 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన సత్వర పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు సుహాసిని, హనుమాన్‌నాయక్, డివిజనల్ సర్వే ఇన్స్పెక్టర్ రాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు శ్రీకాంత్, సతీష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ వెంకన్న

ఇందిరమ్మ ఇళ్ల జాబితా ప్రదర్శన

- గ్రామ పంచాయతీ నోటీసు బోర్డుల్లో పేర్లు

లింగాలఘణపురం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి అర్హుల జాబితా అంటూ ఎల్–1, ఎల్–2, ఎల్–3 జాబితాలను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సిద్ధం చేశారు. అందులో అర్హులైన లింగాలఘణపురం మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 470 మంది పేర్లను జీపీ కార్యదర్శులకు అందజేశారు. వీరిలో ఇంకా ఎవరైన అనర్హులు ఉంటే తొలగించాలని పేర్కొంటూ తిరిగి మళ్లీ ఇంటింటి సర్వే చేయించారు. సర్వే అనంతరం జాబితాను ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ బోర్డులపై ఏర్పాటు చేశారు. ఇంకా అనర్హులు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని పంచాయతీ కార్యదర్శులు నోటీసు బోర్డుల్లో పేర్కొన్నారు. ఇప్పటికి మండలంలోని ఏ ఒక్క జీపీలో ఫిర్యాదులు రాలేదని ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా కొంత మంది లబ్ధిదారులు తమ ఆర్థిక పరిస్థితి సరిగా లేదని, ఇప్పుడు తాము ఇళ్ల నిర్మించుకొనే పరిస్థితి లేదని తమను ప్రస్తుతం లబ్ధిదారుల జాబితాలో నుంచి తొలగించాలని లిఖిత పూర్వకంగా అందజేస్తున్నారు. కాని అనర్హులకు ఇళ్లు వచ్చాయని మాత్రం ఇప్పటి వరకు ఏ ఒక్కరు ఫిర్యాదు చేయలేదు. ఇటీవల జీడికల్‌లో లబ్ధిదారుల జాబితాను విచారించేందుకు వెళ్లిన అధికారులను నిలదీసిన ప్రజలు ఫిర్యాదు చేసేందుకు మాత్రం ముందుకు రావడంలేదు. అయినప్పటికి పంచాయతీ కార్యదర్శులతో పాటు మండల స్థాయి అధికారులు మరోసారి పూర్తిస్థాయి విచారణ చేసి అనర్హులను తొలగించి ఫైనల్ లిస్టును ప్రభుత్వానికి అందజేయనున్నారు.



మండల కేంద్రంలోని జీపీలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలిస్తున్న గ్రామస్తులు

రాజకీయాలకతీతంగా ప్రజాపాలన



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: రాజకీయాలకతీతంగా పరిపాలన కొనసాగిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆరు మండలాల బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అన్నపూర్ణ పథకం కింద ప్రతి కుటుంబానికి నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, కొడకండ్ల మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, సురేష్‌నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడకండ్ల: మండలంలోని బాధిత కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన మొండ్రాయి గ్రామానికి చెందిన జిలుకర రామచంద్రు, ఏడునూతులలో బొల్లోజు లక్ష్మి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మండల అధ్యక్షుడు యాకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: మండలంలోని మాధపురం, కడవెండి గ్రామాల్లో పలువురు మృతుల, అనారోగ్యం బారిన పడిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరామర్శించి హనుమాండ్ల ఝాన్సీ, రాజేందర్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పల సురేష్ బాబు, మాజీ వైస్ఎంపీపీ శ్రీనివాసాచారీ, సుధాకర్, భాగ్య, తిరుపతి నాయక్, మైస్సారావు తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయండి

పాలకుర్తి టౌన్: ఈనెల 25వ తేదీన పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే నియోజకవర్గ సదస్సురె జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ పోలాస సోమయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు మూల ప్రభాకర్‌గౌడ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి చేతుల మీదుగా సదస్సు కరపత్రాలను ఆవిష్కరింపజేసి ఆమెను ఆహ్వానించారు. సంఘం మండల అధ్యక్షుడు సింగ మహేందర్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి లావుడ్యా రవి, మాజీ సర్పంచ్ వీరమానేని యాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



రఘునాథపల్లి: రఘునాథపల్లి గ్రామానికి చెందిన సామాజిక వేత్త బిర్రు సతీష్ భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియామకం అయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్యయాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరి మంగళవారం సతీష్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సతీష్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియమానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభా పురస్కారం

పాలకుర్తి: ప్రపంచ తెలుగు సాహితీ పట్టాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో ‘శ్రీశ్రీ జోహార్లు అందుకో’ అనే కవితాగానం చేసిన మాన్యపు భుజేందర్‌కు జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. భుజేందర్ మంగళవారం పాలకుర్తిలో అవార్డు వివరాలను వెల్లడించారు. అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో 10,11 తేదీల్లో ఏపీలోని ఏలూరులో నిర్వహించని వేడుకల్లో తనకు అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.



భుజేందర్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

క్రైం కార్నర్


ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య



శివ(ఫైల్)

దేవరుప్పుల: ప్రేమ విఫలమైందని ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చౌడూరులో చోటుచేసుకుంది. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం మేరకు.. చౌడూరుకు చెందిన పానుగంటి శివ (23) అనే యువకుడు వృత్తిరీత్యా డ్రైవర్ పనిచేస్తూ రెండేళ్ల కిందట హైదరాబద్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ యువతితో ప్రేమాణంలో పడగా ఇటీవల ఆమెకు మరొకరితో వివాహం నిశ్చయమైంది. ఈ విషయమై మనస్థాపం చెందడంతో తండ్రి ఎల్లయ్య స్వగ్రామం చౌడూరుకు పోయి ప్రశాంతంగా ఉండని, మకొక మంచి యువతితో వివాహం చేస్తానని నచ్చజెప్పి పంపారు. దీంతో స్వగ్రామానికి వచ్చిన శివ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొద్దిసేపటికి మృతుని నాయనమ్మ వచ్చి తలుపు తీసేందుకు యత్నించగా చప్పుడుచేయకపోవడంతో పరిసరాల వ్యక్తులకు విషయం తెలుపగా పగుల గొట్టి చూసే సరికి అప్పటికే మృతి చెందాడు. తన చేతిపై యువతి పేరుతోపాటు సెల్‌ఫోన్‌లో కాల్స్‌ను బట్టి ప్రేమ వ్యవహారం వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు విదితమవుతుందన్నారు. ఈ విషయమై మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ.. బంగారం, వెండి, నగదు అపహరణ



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

స్టేషన్‌ఘన్‌పూర్: తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి అర్ధతులం బంగారం, నలభై తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు అపహరించిన సంఘటన మండలంలోని తాటికొండ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాటికొండ గ్రామానికి చెందిన వనమాల వేదకుమార్, వాణి దంపతులు వారి కుమార్తె వివాహాన్ని పెట్టుకున్నారు. ఈనెల 8వ తేదీన వరంగల్‌లో వివాహం ఉండగా 4వ తేదీన ఇంటికి తాళం వేసి వెళ్లారు. కాగా, మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గమనించి యజమాని వేదకుమార్‌కు సమాచారం అందించాడు. వెంటనే తాటికొండకు చేరుకున్న వేదకుమార్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచిఉంది. ఇంట్లోకి దొంగలు చొరబడి చోరీ చేశారని గుర్తించిన బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలో ఉన్న 5 గ్రాముల బంగారం, 40 తులాల వెండి, రూ.లక్ష నగదుతో పాటు ఇంట్లోని కిరాణాసామాన్లు దొంగలు ఎత్తుకెళ్లారని తెలిపాడు. కాగా, సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై వినయ్‌కుమార్ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

గొర్రెల దొంగల అరెస్టు



దొంగల అరెస్టును చూపుతున్న ఎస్సై

తరిగొప్పుల: గత ఏడాది డిసెంబర్ నెలలో గొర్రెలను దొంగిలించిన ఓ ముఠాను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు ఎస్సై గుగులోత్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన నీల కనకయ్యకు చెందిన తొమ్మిది మేకలు, ఒక గొర్రెను గుర్తుతెలియన దుండగులు అపహరించుకుపోవడం జరిగిందన్నారు. కాగా, మంగళవారం ఎస్సై శ్రీదేవి, తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మరియాపురం బస్టాప్ వద్ద ముగ్గురు వ్యక్తులు చిల్పూర్ మండలం, చిల్పూర్‌గుట్ట క్రాస్ రోడ్‌కు చెందిన గండికోట సతీష్, నల్గొండ జిల్లా గుండాల మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన రాపోలు వంశీ, చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కొమ్మరాజుల రాకేష్‌లు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా నీల కనకయ్య జీవాలను అపహరించి చెంగిచెర్ల సంతలో అమ్మినట్లు నేరం ఒప్పుకోవడం జరిగిందన్నారు.వారి వద్ద నుంచి రూ.60 వేలు రికవరీ చేసి కోర్టులో హాజరుపరచడం జరిగిందన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

కొడకండ్ల: కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లెబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఐసీడీఎస్ ప్రైవేటీకరణను ఆపి, అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మహ్మద్ మైమూదాబేగం డిమాండ్ చేశారు. ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొనాలని ఆమె కోరారు. ఈ మేరకు మంగళవారం కొడకండ్ల ప్రాజెక్ట్ సీనియర్ అసిస్టెంట్ శరత్‌కు సమ్మె నోటీస్‌ను నాయకులతో కల్సి ఆమె అందజేసారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, రామతార, సరిత, గీత తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

జనగామ రూరల్: ఈనెల 20న నిర్వహించే దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు విజేందర్, సింగారపు రమేష్, భూక్యా చందు, రాపర్తి సోమయ్య, గంగాపురం మహేందర్, జోగు ప్రకాశ్, మంగ భీరయ్య, పోత్కనూరి ఉపేందర్ పాల్గొన్నారు.

మతోన్మాదుల ఆగడాలను అడ్డుకోవాలి

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదుల ఆగడాలను ప్రతిఘటించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తుటి దేవదానం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ.. మనువాద కార్పొరేట్ విధానాలతో దేశంలో మత విద్వేషాలు పెట్రేగిపోతున్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం అందరి కర్తవ్యం అన్నారు. ఈనెల 20న దేశ వ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సార్వత్రిక సమ్మెలో సామాజిక శక్తులు సమైక్యంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మబ్బు ఉప్పలయ్య, హతియా సుల్తానా, గడ్డం యాదగిరి, కాకర్ల రమేష్, గోగుల లక్ష్మి, కాకర్ల చిన్నసోమయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మైమూదాబేగం



సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు




మాట్లాడుతున్న శేఖర్

కనులపండువగా వాసవీమాత ఊరేగింపు

జఫర్‌గఢ్: వాసవీమాత ఊరేగింపు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో కనులపండువగా సోమవారం రాత్రి నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో ప్రతిష్ఠించిన వాసవీమాత అమ్మవారి విగ్రహానికి ఐదు రోజులు భక్తిశ్రద్ధలతో వివిధ రకాల పూజలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్‌కుమార్, భిక్షపతి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అంచూరి యుగంధర్, దాంశెట్టి సోమన్న, ఇమ్మడి ఆశోక్, గందె సోమన్న, బజ్జూరి మణికాంత్, బోనగిరి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులతో హెచ్‌ఎం రవీందర్ నాయక్

తరిగొప్పుల: మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు కొనసాగుతోంది. మంగళవారం నాల్గో రోజు శిబిరాన్ని హెచ్‌ఎం బానోత్ రవీందర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, అన్ని రకాల వసతుల కల్పన కూడా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాలెపు విజయ, భీంరెడ్డి రవీందర్‌రెడ్డి, నాగపురి వీరస్వామి, యాటెల్లి శ్రీకాంత్, సీఆర్పీలు మహిలక్ష్మి, అనూష విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బచ్చన్నపేట: బీజేపీ అభివృద్ధికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల స్థాయి పూర్తి కమిటీని మండల అధ్యక్షుడు బంగారు మహేశ్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా రాపెల్లి చక్రపాణి, దాసారం ప్రవీణ్, మడేల్‌పాటి రమేష్, కందుకూరి నవీన్, జనరల్ సెక్రటరీలుగా మిన్నాలపురం జలేందర్, గద్ద రాజు, కార్యదర్శులుగా రావుల శ్రీకాంత్‌రెడ్డి, పసుల కమలాకర్, నడిగొట్టు చిరంజీవి, దుగ్యాని తిరుపతిలను ఎన్నుకున్నారు. బీజేవైఎం ఉపాధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.